క్లుప్తంగా

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు



లాప్‌టాప్‌లు అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న 13 మంది విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ కె. వెట్రిసెల్వి సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో రూ.4.68 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లను జేసీ పి.ధాత్రిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెట్రిసెల్వి మాట్లాడుతూ దృష్టి లోపం, బధిరులు, చలన వైకల్యం గల విద్యార్థినీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నట్టు చెప్పారు. చదువులో లాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త రాజు మృతి



రాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జయప్రకాష్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త మాగపు రాజు మృతిచెందారు. ఆయన మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ నివాళులర్పించారు. రాజు కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతి తెలిపారు. పార్టీ రాజు కుటుంబానికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పార్టీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, నగర ఈసీ మెంబర్ అయినపర్తి శ్యామ్, ఠాగూర్, రమేష్, స్థానిక నాయకులు నివాళులర్పించి, రాజు కుటుంబానికి సానుభూతి తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. పేరంపేటకు చెందిన బిళ్ల ద్వారకానాథ్‌రెడ్డి లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. 6 నెలల క్రితం పేరంపేటకు వచ్చి ఇంటి వద్ద నుంచే పనిచేస్తున్నాడు. ఈ నెల 20వ తేదీ ఉదయం సెల్‌ఫోన్ రిపేరు కోసం జంగారెడ్డిగూడెం వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో తల్లి బిళ్ల వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ద్వారకానాథ్‌రెడ్డికి వివాహమైనట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

తమ్మిలేరు ప్రక్షాళన జరిగేనా?

- నిలిచిపోయిన గుర్రపు డెక్క, తూడు
- వర్షాకాలం.. పొంచి ఉన్న వరద ముప్పు
- కలెక్టర్ ఆదేశించినా చర్యలు శూన్యం



కొత్త బస్టాండు వద్ద తమ్మిలేరు వంతెన వద్ద ఏటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు



కొత్త బస్టాండు వద్ద తమ్మిలేటిలో గుర్రపుడెక్కలో ఇరుక్కుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



శనివారపు పేట కాజ్ వే వద్ద తమ్మిలేటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరుకు ఆ పేరు ఎలా వచ్చిందని అడిగితే ఇక్కడ పుట్టి పెరిగిన వారు ఠక్కున చెప్పే సమాధానం ఒక్కటే ఏలూరు చుట్టూ ఏరులు పారుతూ ఉండటమేనని. కాలక్రమంలో అదే ఏలూరు అయిందని. ఒక నగరానికి తన కారణంగా వచ్చిన పేరును ఆ నగరం చెడగొడుతోందని తమ్మిలేరు కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. పైన అడవులు, గిరిజన ప్రాంతాల్లో కురిసిన వర్షాల నీరు, వాగుల నుంచి తమ్మిలేటిలో కలిసే నీటి కారణంగా ఏటిలో వరదలు సంభవిస్తుంటాయి. అది కూడా ఐదేళ్లు లేదా పదేళ్లకోసారి. మిగిలిన సమయాల్లో నగర ప్రజలను ఇబ్బంది పెట్టకుండా తనపని తాను సజావుగా చేసుకుంటూ వెళుతుంది ఈ తమ్మిలేరు. అయితే ఇటీవల నగర ప్రజలు వ్యర్థాలను వేస్తూ, తాము వినియోగించిన మురుగు నీటిని తమ్మిలేరులోకి విడుదల చేస్తూ కలుషితం చేస్తున్నారు.

నీటి ప్రవాహానికి ఆటంకం

వర్షాకాలంలో మినహా తమ్మిలేరులో నీటి ప్రవాహం అత్యంత స్వల్పంగా ఉంటుంది. దీంతో ఏటిలో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోతుంది. ఇది వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతుంది. దీంతో వర్షాకాలం వస్తుందంటే నగర ప్రజల్లో ఆందోళన మొదలౌతుంది. నాగిరెడ్డిగూడెం జలాశయం నిండిపోయి అక్కడి వరద నీటిని తమ్మిలేరులోకి విడుదల చేస్తే ఆ వరద ప్రవాహం నగరానికి చేరుకుంటుంది. ఈ ప్రవాహానికి తమ్మిలేరులో ఎక్కడ చూసినా పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క ఆటంకంగా మారి గండిపడే ప్రమాదం ఉంటుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి తమ్మిలేరుకు నిధులు విడుదల చేయడంతో చాలా ప్రాంతంలో రివిట్‌మెంట్ నిర్మాణం పూర్తి చేశారు. అయితే మరి కొంత భాగం ఈ రివిట్‌మెంట్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వరదలు ఎక్కువగా వస్తే రివిట్‌మెంట్ లేని ప్రాంతంలో గండిపడే ప్రమాదముందంటున్నారు.

ముంపు ముప్పు

నగర ప్రజలు చాలా మంది తమ గృహాల్లో వినియోగించే వ్యర్థనీటిని తమ్మిలేరులో కలిసేలా ఏర్పాటు చేసుకున్నారు. మరి కొందరు పూజా సామగ్రిని ప్లాస్టిక్ కవర్‌లో వేసి తమ్మిలేరులోకి పారేస్తున్నారు. సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే వాహనాల ద్వారా ఆ వ్యర్థాలను తమ్మిలేరులోనే విడుదల చేస్తున్నారు. హోటళ్లు, పండ్లు, కొబ్బరిబొండాలు, చెరుకు రసం వ్యాపారులు తమ వ్యర్థాలను ఏటిలోనో, ఏటిగట్టుపైనో డంప్‌చేస్తున్నారు. ఆయా వ్యర్థాల కారణంగా తమ్మిలేరు గట్టు వెడల్పు క్రమంగా తగ్గిపోయే ప్రమాదముందని, లోతు పూడుకుపోయి వరదలకు ఏలూరు నగరానికి ముంపు ముప్పు లేకపోలేదని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు.

కలెక్టర్ ఆదేశించినా చర్యలు శూన్యం

గత శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో తమ్మిలేరును కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించారు. వ్యర్థాలతో నిండిపోవడంతో ఆమె నగరపాలక సంస్థ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ్మిలేరును వెంటనే ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. ఏరును కలుషితం చేయకుండా నగర ప్రజలకు అవగాహన కలిగించేలా ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాను తరచూ తమ్మిలేరు పరిసరాలను తనిఖీ చేస్తానని, ఎక్కడ అపరిశుభ్రంగా ఉన్నా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అయినా అధికారులు, సిబ్బంది వ్యవహార తీరులో మార్పు రాలేదు. కొత్త బస్టాండు వద్ద తమ్మిలేరు వంతెనకు సమీపంలో ప్రజలు వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించకుండా కొంతదూరం తోసి మమ అనిపించారు. వాటిని కనీసం గట్టువైపు కూడా చేర్చకపోవడంతో తమ్మిలేరు నీటిలో కనిపిస్తున్నాయి.

తూడు, గుర్రపుడెక్క తొలగించాలి



ఎప్పుడు చూసినా తూడు, గుర్రపుడెక్కతో నిండిపోయి ఉంటుంది. తమ్మిలేరులో నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. ఇతర సమయాల్లో ఎలా ఉన్నా, వర్షాకాలంలో వరద ముంపు ప్రమాదం పొంచి ఉంటుంది. రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిస్తే పై నుంచి వచ్చే వరద నీరు తమ్మిలేరును ముంచెత్తుతుంది. నగర ప్రజలు ఈ ఏడాది వరద బారిన పడకుండా ఉండాలంటే తూడు, గుర్రపుడెక్క తొలగించాలి.

– నల్ల సత్యనారాయణ, వ్యవసాయ కూలీ, ఏలూరు

వ్యర్థాలు వేయకుండా అడ్డుకోవాలి



తమ్మిలేరులో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ సంచులు, కొబ్బరి బొండాలు, ఇతర వ్యర్థాలు కనిపిస్తూనే ఉంటాయి. వీటి వల్ల తమ్మిలేరు పక్క ప్రాంతాల్లో నివాసితులు దోమలు, విష పురుగుల బారిన పడుతున్నారు. దుర్గంధం వెదజల్లుతోంది. సాయంత్రం అయితే విపరీతమైన దోమలు తిరుగుతూ అంటువ్యాధులకు కారణమౌతుంది. తమ్మిలేరులో వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కలిగించాలి. తగు చర్యలు తీసుకోవాలి.

– కుర్మాని భవానీ శంకర్, ఐటీఐ విద్యార్థి, ఏలూరు

మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్ నిర్వీర్యం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మత్తు పదార్థాల వాడకం వల్ల యువత భవిష్యత్తు నిర్వీర్యం అవుతుందని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.యోహాన్ హెచ్చరించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌పై స్థానిక కోటదిబ్బ డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహనా కార్య క్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.గిరిబాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు తోటి మిత్రులు, బంధువులలో అవగాహన పెంచి నషా ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేయాలని సూచించారు. ఏలూరు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాంకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నషా ముక్త్ భారత్ సాధన కోసం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలన్నారు. ఈగల్ టీం ఎస్సై ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకంపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1972, మాదక ద్రవ్య వినియోగుల కౌన్సెలింగ్ కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14446లో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎం అవంతి, ఎస్‌కే అబ్దుల్ మతీన్, సీహెచ్ జాహ్నవిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా పోస్టర్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మంజులత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, పొలిటికల్ సైన్సు అధ్యాపకులు టీవీ దుర్గా ప్రసాద్, ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ సూర్యచక్ర, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెయింటింగ్ కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో పాల్గొన్న శ్రీనివాస డాంగే

ఏలూరు (టూటౌన్): పెయింటింగ్ కార్మికులు, ఆర్టిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో సోమవారం నిర్వహించిన పెయింటింగ్ కార్మికుల యూనియన్ సభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకుడు పల్లెం కిషోర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం, పనులు మందగించడంతో కార్మికులకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. జూట్ మిల్ వంటి పరిశ్రమలు మూతపడటంతో భవన నిర్మాణంలోకి అదనంగా నిరుద్యోగ కార్మికులు వచ్చి చేరారని తెలిపారు. కార్మికులకు వర్తించే భవన నిర్మాణ సంక్షేమ వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు అమలు కాకపోవడం వల్ల పెయింటింగ్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. పనులు దొరకని పెయింటింగ్, ఇతర నిర్మాణ కార్మికులకు కరువు భత్యం చెల్లించాలని కోరారు. పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అజిత్ కుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, యూనియన్ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి మహమ్మద్ జాని, నాయకులు పేడారి వంశీ తదితరులు మాట్లాడారు.

పోలీస్ శాఖకు డ్రోన్ అందజేత



ఎస్పీ శివకిషోర్‌కు డ్రోన్ అందజేస్తున్న స్కూల్ జీఎం వెంకటేశ్వరరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ శాఖకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే డ్రోన్‌ను డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ యాజమాన్యం అందజేసినట్టు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. డ్రోన్‌ను స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం కేకేఆర్ గౌతమ్ స్కూల్ జనరల్ మేనేజర్ జాస్తి వెంకటేశ్వరరావు ఎస్పీకి అందజేశారు. అత్యాధునిక డీజేఐ ఏఐఆర్ 3ఎస్ డ్రోన్ అందించటం అభినందనీయమని ఎస్పీ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నిఘా, ట్రాఫిక్ పర్యవేక్షణ, విపత్తు నిర్వహణలో డ్రోన్ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్‌వీ ప్రసాద్, గౌతమ్ స్కూల్స్ ప్రతినిధులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంపై నిరసన గళం

- సూపర్ సిక్స్ పథకాల అమలుపై నిలదీత
- ఏలూరులో కదం తొక్కిన నిరుద్యోగ యువత, వైఎస్సార్ సీపీ శ్రేణులు



ర్యాలీలో పాల్గొన్న జిల్లా మహిళా అధ్యక్షురాలు సరితారెడ్డి, లీగల్‌సెల్ అధ్యక్షులు ప్రత్తిపాటి తంబి, న్యాయవాదులు, మహిళ నేతలు

ఏలూరు టౌన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో ఏలూరు నగరంలో ఆ పార్టీ చేపట్టిన యువత పోరు విజయవంతమైంది. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ పార్టీ నేతలు, శ్రేణులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, మహిళలతో కిక్కిరిసిపోయింది. కూటమి పాలనలో ఏడాది కాలంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తారనే ఆశతో ఎదురుచూసిన జనం తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ రోడ్డుపైకి వచ్చారు. ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి ఎస్ఆర్ పేట, జెడ్పీ కార్యాలయం వరకు పార్టీ జెండాలు రెపరెపలాడాయి. యువత మోటారు సైకిల్ల ర్యాలీ చేస్తూ ఉత్సాహంగా జై జగన్ అంటూ హోరెత్తించారు. కూటమి నేతలు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధానంగా పెట్టిన నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాల కల్పనపై యువత తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసన ర్యాలీ, ధర్నాకు హాజరయ్యారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఎప్పుడంటూ ప్లకార్డులను ప్రదర్శించారు.

నేతలకు ఘన స్వాగతం

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఆధ్వర్యంలో చేపట్టిన యువత పోరుకు రాష్ట్ర యువజన అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి ఏలూరు నగరంలో ఘన స్వాగతం పలికారు. పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో వందలాదిగా మోటారు సైకిళ్ల ర్యాలీ పవర్‌పేట నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు నిర్వహించారు. దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

శ్రేణుల్లో నూతనోత్సాహం

ఏలూరు నియోజకవర్గంలో యువత పోరుతో వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లువెత్తుతోంది. ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్ ఆధ్వర్యంలో ఏలూరులో చేపట్టిన నిరసన కార్యక్రమంలో నగరంలోని పార్టీ నేతలు, మహిళా నేతలు, శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల ముఖ్యనేతలంతా ర్యాలీలో పాల్గొని కూటమి పాలనపై తమ నిరసన తెలిపారు.



స్థానికులకే ఉద్యోగాల్లో రిజర్వేషన్ అంటూ ప్లకార్డుల ప్రదర్శన



నిరుద్యోగ భృతి ఎప్పుడు అంటూ ప్లకార్డులతో మహిళలు



వైఎస్సార్ సీపీ రంగులతో ఉన్న గొడుగు వేసుకుని పార్టీ నేతల సందడి

హామీల అమలులో మోసం

ఈ సందర్భంగా సమన్వయకర్త జయప్రకాష్ మాట్లాడుతూ కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ముఖ్యంగా సూపర్ 6 హామీలను సైతం అమలు చేయకుండా మోసం చేయటం దారుణమని అన్నారు. నిరుద్యోగ యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఒక ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా, హామీలను పక్కనబెట్టి ఏడాది కాలంలో వేలాది మందికి ఉపాధి లేకుండా చేశారని విమర్శించారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు చొప్పున 12 నెలలకు రూ.36వేలు చెల్లించాల్సి ఉందన్నారు. ఇక విద్యార్థులకు ఫీజ రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోయినా సీఎం చంద్రబాబు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ప్రభుత్వ తీరు ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్తులో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్, పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, కార్పొరేటర్లు ఇనపనూరి కేదారేశ్వరి, డింపుల్ జాబ్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు ఇనపనూరి జగదీష్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, పార్టీ నాయకులు గెదెల సూర్యప్రకాష్, ఎండీ కై సర్, దాసరి రమేష్, తులసీ వర్మ, బుద్దాల రాము, జనార్ధన్, పిట్టా ధనుంజయ్, గంటా సాయిప్రదీప్, మేతర సురేష్, కొవ్వాడ దుర్గారావు, బత్తుల ప్రభాకర్, లక్కబత్తుల యేసుపాదం, ఎచ్చర్ల ఉమా మహేష్, మద్దాల ఫణి, ఉయ్యాల గణేష్, తులసీ, బండ్లమూడి సునీల్, కిలారపు బుజ్జి, షేక్ గాజుల బాజీ, బాస్కర్ల బాచీ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	28	బిళ్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	34	చామదుంపలు	40
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	44	బీట్‌రూట్	40
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	86
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	38
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

సంక్షిప్తం

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి

ఏలూరు (టూటౌన్): భారతీయ జనసంఘ్, ప్రస్తుత బీజేపీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఆ పార్టీ శ్రేణులు ఘన నివాళులర్పించాయి. స్థానిక అశోక్‌నగర్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిషోర్ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఆటోనగర్ అభివృద్ధికి పోరాటం

ఏలూరు (టూటౌన్): ఆటోనగర్ అభివృద్ధికి పోరాడతామని సీపీఐ ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ తెలిపారు. సోమవారం ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతూ మాజీ అధ్యక్షుడు మాగంటి నాగభూషణం చర్యలకు వ్యతిరేకంగా అసోసియేషన్ కమిటీకి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

కంద్రికగూడెం పీడీగా కృష్ణారావు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం కంద్రికగూడెం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌గా ఎం కృష్ణారావు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పోతునూరు నుంచి ఆయన సాధారణ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు.

చెరువుల విస్తీర్ణం, సర్వే నంబర్లు సరిచూసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ సతీష్

దెందులూరు: ఆక్వా రైతులు తమ చెరువుల విస్తీర్ణం, సర్వే నంబర్లు ఆన్‌లైన్‌లో వివరాలను నిర్ధారించుకోవాలని మత్స్యశాఖ ఏలూరు ఎఫ్‌డీఓ సతీష్ అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం జాలిపూడి, కాట్లంపూడి, శ్రీపర్రు గ్రామాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆక్వా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల్లో ఆక్వా రైతులు ఉద్దేశించి ఎఫ్‌డీఓ సతీష్ మాట్లాడుతూ ఆక్వా జోనేషన్‌లో భాగంగా రైతులు ఒకటి రెండు సార్లు చెరువు విస్తీర్ణం, సర్వే నంబరు, ఆన్‌లైన్ ప్రక్రియను తనిఖీ చేసుకోవాల్సిన వ్యక్తిగత అవసరం రైతులపైనే ఉందని చెప్పారు. రైతులు సాగు ప్రక్రియలో మత్స్యశాఖ పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దయనీయ స్థితిలో పొగాకు రైతులు

జంగారెడ్డిగూడెం: పొగాకు రైతులు దయనీయ స్థితికి నెట్టవేయబడుతున్నారని వర్జీనియా వేలం కేంద్రం రైతు సంఘం నాయకుడు వామిశెట్టి హరిబాబు సోమవారం పేర్కొన్నారు. గత ఏడాది వర్జీనియా పొగాకు కేజీ ఒక్కింటికి రూ. 410 ధర పలుకగా నేడు రూ. 290కి కొనుగోలు చేయడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతోందన్నారు. అది కూడా గ్రేడ్-1 పొగాకు ఈ పరిస్థితిలో ఉండగా, మీడియం, లోగ్రేడ్ ధర మరింత దారుణంగా ఉందన్నారు. ఈ ఏడాది వాతావరణం సరిలేక లోగ్రేడు పొగాకు వచ్చిందన్నారు. 80 మిలియన్లు పొగాకు అవుతుందని బోర్డు వాళ్లు అంచనా వేశారని, ప్రస్తుత ధరలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి మార్క్ ఫెడ్ ద్వారా 15 మిలియన్లు పొగాకు కొనగలిగితే రైతులకి మంచి గిట్టుబాటు ధర వస్తుందని హరిబాబు అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వంగయగూడెం (ఏలూరు)లో వీసీటీకి కేబుల్, పోణంగి సబ్ స్టేషన్‌కు సరఫరా ఇవ్వడానికి ఫీడర్లను డైవర్ట్ చేసే పనుల నిమిత్తం మంగళవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోణంగి, పాత ముప్పర్రు, పులపర్రు, కైకలూరు సబ్ స్టేషన్లు, కొప్పాక, భోగాపురం, జానంపేట సబ్ స్టేషన్లు, ఎస్‌వీతోట, ఆశ్రం హాస్పటల్ సబ్ స్టేషన్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. ఏలూరు ఒన్‌టౌన్‌లో ఉన్న వెంకన్న చెరువు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చిరంజీవి బస్‌స్టాండ్ ఏరియా, మార్వాడి గుడి, దక్షిణపు వీధి, మార్కండేయ స్వామి గుడి, రాజగారి మేడ, దొంగల మండపం రోడ్, పాలతూము సెంటర్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.